సాక్షి
నంద్యాల
శుక్రవారం। 7। జూన్। 2024



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం టెంపుల్: నిత్య అన్నదాన పథకానికి గుజరాత్ రాష్ట్రం రాజ్‌కోట్‌కు చెందిన సీపీ పాండ్య రూ.1,12,000 విరాళాన్ని ఆలయ పర్యవేక్షణకురాలు టి.హిమబిందుకు అందజేశారు.



సరస్వతీదేవికి పూజలు

కొత్తపల్లి: శివపురం గ్రామ శివారులోని కొలనుభారతీదేవి ఆలయంలో వెలసిన సరస్వతీదేవి అమ్మవారు గురువారం అమావాస్య రోహిణీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలం టెంపుల్: ధర్మపథంలో భాగంగా గురువారం నిత్యకళారాధన వేదిక వద్ద కడపకు చెందిన ఎన్.రఘునాథ్, బృందం ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం భక్తులను ఆకట్టుకుంది.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా పార్లమెంటరీ కమిటీ

నంద్యాల టౌన్: జిల్లాలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉండేందుకు, వారికి న్యాయపరంగా, వైద్య పరంగా, ఆర్థికంగా సహాయంగా నిలవడానికి పార్టీ కేంద్ర కార్యాలయం రాష్ట్ర వ్యాప్తంగా పార్లమెంటరీ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఏర్పాటైన నంద్యాల పార్లమెంటరీ కమిటీలో కాటసాని రాంభూపాల్ రెడ్డి, పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, గంగుల బిజేంద్ర రెడ్డి, శిల్పా చక్రపాణి రెడ్డి, శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, కాటసాని రామిరెడ్డి, సుధీర్ ధారాలను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

హడలెత్తిస్తున్న కూరగాయల ధరలు



నంద్యాల(న్యూటౌన్): కూరగాయల ధరలు సామాన్యుడిని హడలెత్తిస్తున్నాయి. కొని తినలేనంతగా పెరిగిపోయాయి. బీన్స్ కిలో ధర పది రోజుల కిందట రూ.75 ఉండగా.. గురువారానికి అది రూ.110కి చేరింది. నాటు కాకరకాయ, చిక్కుడుకాయలు కిలో రూ.70 ప్రకారం పలుకుతున్నాయి. కాప్సికమ్ కిలో రూ.80 ఉండగా, బీరకాయులు, క్యారెట్ కిలో రూ.60 ప్రకారం విక్రయిస్తున్నారు. కాలీఫ్లవర్ కిలో రూ.45 ఉండగా, ముల్లంగి రూ.48, బంగాళాదుంప రూ. 44, దొండకాయ, టమాట, బెండకాయలు, బీట్రూట్ కిలో రూ.40 ప్రకారం అమ్ముతున్నారు. నెల రోజుల నుంచి పచ్చిమిరపకాయల ధర తగ్గడమే లేదు. తొలుత కిలో రూ.25 నుంచి ప్రారంభమై తరువాత రూ.40, ఆపై రూ.100కు చేరి సెంచరీ కొట్టాయి.

అమ్మకానికి సిద్ధంగా పొద్దుతిరుగుడు విత్తనం

నంద్యాల(సెంట్రల్): నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం(ఆర్ఏఆర్ఎస్)లో ఎన్‌డీఎస్‌హెచ్ –1012(ప్రభాత్) రకం హైబ్రిడ్ పొద్దు తిరుగుడు విత్తనం అమ్మకానికి సిద్ధంగా ఉన్నట్లు సహ సంచాలకురాలు డాక్టర్ సరళమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 31 క్వింటాళ్లు అందుబాటులో ఉందని, కేజీ విత్తనం ధర రూ.500గా నిర్ణయించామని పేర్కొన్నారు. అన్నదాతలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు. పూర్తి వివరాలకు రైతులు 9989625208, 9966665434, 8142263221 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

51 ఏళ్ల తర్వాత అ'పూర్వ' కలయిక



వేదికపై పూర్వ విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): ఎస్పీజీ హైస్కూల్‌లో 1972–73 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు గురువారం కలుసుకున్నారు. అప్పటి రోజులను గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయుల విద్యాబోధన, క్రమశిక్షణ స్మరించుకున్నారు. అనాటి మిత్రులు 20మందిని కలుసుకోవడం సంతోషంగా ఉందని రిటైర్డు ఫారెస్ట్ అధికారి మోహన్ చాణిక్యరాజు అన్నారు. కార్యక్రమంలో స్వామి, బ్రహ్మానందరెడ్డి, శ్రీనివాసరెడ్డి, శివశంకర్‌రాజు, విజయ, మనోరంజని, లక్ష్మీనరసింహ, జ్యోతిరాణి, మద్దెల సామేలు, సంధ్యారాణి, వీశాలాక్షి, భాగ్యమ్మ, పుష్పలత పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'ఓపెన్' సప్లిమెంటరీ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో ఓపెన్ స్కూల్ పదోతరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని జిల్లా విద్యాశాఖాధికారి సుధాకర్‌రెడ్డి, జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం జరిగిన గణితం, చరిత్ర, భారతీయ సంస్కృతి, వారసత్వం పరీక్షలకు 733 విద్యార్థులకు గాను 656 మంది హాజరుకాగా, 77మంది గైర్హాజరైనట్లు చెప్పారు. ఇంటర్ గణితం, చరిత్ర పరీక్షకు 182 మంది విద్యార్థులకు గాను 165 మంది హాజరు కాగా 17 మంది గైర్హాజరయ్యారన్నారు.

టీబీ డ్యాంకు పెరిగిన ఇన్‌ఫ్లో

హొళగుంద: కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో గురువారం ఇంకాస్తా మెరుగు పడింది. బుధవారం ఇన్‌ఫ్లో 517 క్యూసెక్కులు ఉండగా గురువారం 1,670 క్యూసెక్కులకు పెరిగింది. ప్రస్తుతం డ్యాంలో 3.706 టీయంసీల నీరు నిల్వ ఉంది. అందులో 10 క్యూసెక్కులు (అవుట్‌ఫ్లో) రాయబసవన కెనాల్‌కు వదులుతున్నట్లు టీబీ బోర్డు అధికారులు తెలిపారు. గతేడాది ఇదే సమయానికి 5.029 టీయంసీల నీరు నిల్వ ఉంటే 723 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో, 251 క్యూసెక్కులు అవుట్‌ఫ్లో ఉండేది.

ఆశల పల్లకీలో నేతలు

- సార్వత్రిక పోరులో అత్యధిక స్థానాల్లో కూటమి విజయం
- 2004 తర్వాత టీడీపీకి తొలిసారి అత్యధిక అసెంబ్లీ స్థానాలు
- కూటమి అధికారంలోకి రావడంతో మంత్రి పదవులపై చర్చ
- రేసులో కోట్ల, బీసీ, టీజీ, భూమా, ఫరూక్
- తమ నాయకుడికే అవకాశమని కేడర్‌లో ధీమా

సార్వత్రిక పోరు ముగిసింది. కూటమి అధికారంలోకి వచ్చింది. త్వరలోనే కూటమి నేతగా నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ క్రమంలో చంద్రబాబు మంత్రివర్గంలో ఎవరికి చోటు లభిస్తుందనే చర్చ కర్నూలు, నంద్యాల జిల్లాలో మొదలైంది. 2004 తర్వాత అత్యధిక స్థానాల్లో తెలుగుదేశంపార్టీ విజయం సాధించడంతో మంత్రి పదవి ఆశించేవారి సంఖ్య కూడా పెరిగింది. నంద్యాల జిల్లా కొత్తగా ఏర్పడిన తర్వాత టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు కాబోతోంది. దీంతో కొత్త జిల్లాల ప్రాతిపదికన జిల్లాకో మంత్రి పదవి ఇస్తారా? లేదా ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఒకే మంత్రి పదవి ఇస్తారా? అనే చర్చ కూడా జోరుగా సాగుతోంది. సీనియర్ నేతలకు మంత్రి పదవి దక్కుతుందని అధిక శాతం నేతలు భావిస్తున్నా, సామాజిక సమీకరణల నేపథ్యంలో తమకూ అవకాశం దక్కుతుందని తొలిసారి అసెంబ్లీకి వెళ్లే నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నేనే మంత్రి!





సాక్షి ప్రతినిధి కర్నూలు: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రెండు ఎంపీలతో పాటు 12 అసెంబ్లీలు కూటమి అభ్యర్థులు గెలుపొందారు. ఆదోనిలో బీజేపీ అభ్యర్థి పార్థసారథి ఎమ్మెల్యేగా గెలుపొందితే, తక్కిన 11 చోట్ల టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. ఆలూరు, మంత్రాలయంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలుగా విరూపాక్షి, బాలనాగిరెడ్డి గెలుపొందారు. టీడీపీ అభ్యర్థుల్లో మంత్రి వర్గంలో కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి ముందు వరుసలో ఉన్నారు. సార్వత్రిక పోరులో ప్రకాశ్‌రెడ్డితో పాటు ఆయన సతీమణి సుజాతమ్మ టిక్కెట్లు ఆశించారు. అయితే ఆమెకు టిక్కెట్ ఇవ్వలేమని, డోన్ అసెంబ్లీ నుంచి బరిలోకి దిగాలని.. గెలిస్తే మంత్రివర్గంలోకి తీసుకుంటామని చంద్రబాబు హామీ ఇచ్చారనే చర్చ కోట్ల వర్గంలో నడుస్తోంది. దీంతో ప్రకాశ్‌రెడ్డికి కచ్చితంగా మంత్రివర్గంలో చోటు లభిస్తుందనే ఆశాభావం ఆయన వర్గీయుల్లో కనిపిస్తోంది. కోట్ల అసెంబ్లీకి వెళ్లడం ఇదే తొలిసారి. గతంలో ఆదోని నుంచి పోటీ చేసి మీనాక్షినాయుడు చేతిలో ఓడిపోయారు. అయితే కర్నూలు ఎంపీగా ఆయన పలుసార్లు ప్రాతినిథ్యం వహించారు. కేంద్రమంత్రిగా కూడా పని చేశారు.

నంద్యాల జిల్లా నుంచి రేసులో ముగ్గురు

నంద్యాల జిల్లా బనగానపల్లి ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి కూడా మంత్రివర్గంలో చోటు ఆశిస్తున్నారు. 2014లో తొలిసారి అసెంబ్లీకి వెళ్లిన బీసీ, 2019లో ఓటమి చెందారు. తిరిగి 2024లో విజయం సాధించారు. నంద్యాల జిల్లాలో సీనియర్ ఎమ్మెల్యేగా ఉన్న బీసీ కూడా కేబినెట్ బెర్త్‌పై ఆశపెట్టుకున్నారు. ఇదే జిల్లాలో భూమా అఖిలప్రియ కూడా మంత్రివర్గంలో చోటుపై ధీమాగా ఉన్నారు. 2014లో వైఎస్సార్‌సీపీ తరఫున గెలిచిన అఖిలప్రియ ఆపై తన తండ్రి భూమా నాగిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. నాగిరెడ్డి మృతి తర్వాత అఖిలకు మంత్రివర్గంలో చోటు కల్పించారు. పర్యాటక శాఖ మంత్రిగా చేసిన అఖిల ఈ దఫా కూడా మహిళల కోటాలో తనకు అవకాశం వస్తుందనే ధీమాతో ఉన్నారు. అలాగే నంద్యాల ఎమ్మెల్యే ఫరూక్ కూడా మంత్రి వర్గంలో చోటుపై ఆశలపల్లకిలో ఉన్నారు. రెండుసార్లు మంత్రిగా పని చేసిన అనుభవం కూడా ఉంది. మైనార్టీ నేత కావడం, రాయలసీమలో మదనపల్లి, నంద్యాల మాత్రమే మైనార్టీలకు టిక్కెట్లు ఇచ్చారు. ఇద్దరూ గెలుపొందినా వీరిలో ఫరూక్ సీనియర్ కావడంతో మైనార్టీ కోటాలో కచ్చితంగా చోటు దక్కుతుందనే ఆశతో ఉన్నారు.

పార్థసారథిని అదృష్టం వరించేనా?

కర్నూలు జిల్లాలో తొలిసారి బీజేపీ ఎమ్మెల్యేగా ఆదోని నుంచి పార్థసారథి గెలుపొందారు. వాల్మీకి సామాజికవర్గానికి చెందిన ఈయనకు మంత్రివర్గంలో చోటు దక్కే అవకాశాలున్నాయి. కర్నూలు, అనంతపురంలో బలమైన సామాజికవర్గంగా వాల్మీకులు, కురబలు ఉన్నారు. అనంతపురం జిల్లా రాయదుర్గం, గుంతకల్లులో కాలవ శ్రీనివాసులు, గుమ్మనూరు జయరాం ఉన్నారు. వీరిద్దరికీ మంత్రి పదవుల అనుభవం ఉంది. అయితే అనంతపురం జిల్లాలో పోటీ ఎక్కువగా ఉంది. కురబ, వాల్మీకులకు చెరో మంత్రి పదవి ఇవ్వాలని భావిస్తే సత్యసాయి జిల్లా పెనుకొండ ఎమ్మెల్యే సవితకు చోటు దక్కే అవకాశం ఉంది. ఈ క్రమంలో కాలవ, గుమ్మనూరు, పార్థసారథిలో ఒకరికి మంత్రి పదవి దక్కే అవకాశం ఉంది. ఒక బీసీకి అనంతపురంలో ఇస్తే, మరో బీసీకి ఇచ్చే అవకాశం తక్కువగా ఉండొచ్చు. ఈక్రమంలో వాల్మీకి వర్గం నుంచి పార్థసారథిని మంత్రి పదవి వరించే అవకాశం ఉన్నట్లు చర్చ జరుగుతోంది. పైగా ఇతను బీజేపీ నేత కావడంతో.. ఆ పార్టీకి కూడా కనీసం 2 మంత్రి పదవులు దక్కే అవకాశం ఉండటంతో పార్థసారథికి అదృష్టం వరించవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏదేమైనా కర్నూలు, నంద్యాల జిల్లాలో అత్యధిక స్థానాలు గెలుచుకున్న కూటమి అభ్యర్థుల్లో దాదాపు సగం మంది మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. వీరిలో ఎవరికి అమాత్యయోగం ఉందో వేచిచూడాలి.

టీజీ, కేఈలు కూడా మంత్రివర్గంపై ఆశలు

సీనియర్ నేతలతో పాటు తొలిసారి అసెంబ్లీకి వెళ్తున్న కర్నూలు, పత్తికొండ ఎమ్మెల్యేలు టీజీ భరత్, కేఈ శ్యాంబాబు కూడా మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. టీజీ భరత్ ఆర్యవైశ్యుల కోటాలో తనకు తప్పకుండా మంత్రి పదవి దక్కుతుందనే ధీమాతో ఉన్నారు. ఎన్నికల ప్రచారంలో కూడా తనను గెలిపించాలని, ఈ దఫా తాను మంత్రిని కాబోతున్నానని పలువురు ప్రముఖులతో బాహాటంగానే చెప్పారు. భరత్ గెలుపొందిన తర్వాత టీజీ వర్గం కూడా కేబినెట్ బెర్త్ దక్కుతుందని చర్చించుకుంటున్నారు. అలాగే కేఈ శ్యాంబాబు కూడా కేబినెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న ప్రతీ కేబినెట్‌లోనూ కేఈ కుటుంబం ఉంది. కేఈ ప్రభాకర్, కేఈ కృష్ణమూర్తి మంత్రులుగా చేశారు. 2014లో డిప్యూటీ సీఎంగా కూడా కేఈ కృష్ణమూర్తి కొనసాగారు. బీసీ కోటాలో తనకు చోటు దక్కుతుందని శ్యాంబాబు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

155 మందికి డిపాజిట్ గల్లంతు

- ముగిసిన సార్వత్రిక ఎన్నికలు
- గత ఎన్నికల్లో అన్ని చోట్ల డిపాజిట్ కోల్పోయిన జనసేన
- ప్రస్తుత ఎన్నికల్లో ఆ స్థానాన్ని భర్తీ చేసిన కాంగ్రెస్

సాక్షి, నంద్యాల: సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. గెలుపు కోసం ప్రధాన పార్టీల అభ్యర్థులు శక్తివంచన లేకుండా కష్టపడి గౌరవమైన ఓట్లు సాధించారు. అయితే జిల్లాలో అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో 155 మంది అభ్యర్థులు డిపాజిట్ కూడా దక్కించుకోలేకపోయారు. లోక్‌సభకు పోటీ చేసే జనరల్ అభ్యర్థులు రూ.25 వేలను సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లించాలి. షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలకు చెందిన వారు రూ.12,500 చెల్లించాలి. శాసన సభకు పోటీ చేసే అభ్యర్థులు రూ.10 వేలు డిపాజిట్ చేయాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ. 5 వేలు చెల్లించాలి. ఈ మొత్తాన్ని నామినేషన్ వేసే సమయంలో రిటర్నింగ్ అధికారి వద్ద డిపాజిట్ చేయాలి.

ఆరో వంతు ఓట్లు వస్తేనే డిపాజిట్

పోటీ చేసిన అభ్యర్థి మొత్తం పోలైన ఓట్లలో ఆరో వంతు ఓట్లను పొందాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఓ నియోజకవర్గంలో 1,00,000 ఓట్లు పోలయ్యాయి అనుకుంటే అందులో దాదాపు 16,700 ఓట్లు సాధిస్తే డిపాజిట్ దక్కినట్లుగా పరిగణిస్తారు. ఈ మేరకు ఓట్లు సాధించిన వారికి మాత్రమే డిపాజిట్ మొత్తాన్ని తిరిగి చెల్లిస్తారు. లేనిపక్షంలో ఎన్నికల సంఘం ఆ డబ్బులను స్వాధీనం చేసుకుంటుంది. డిపాజిట్ దక్కించుకోని అభ్యర్థులపై సమీప ప్రత్యర్థులు ట్రోల్స్ కూడా చేస్తుంటారు. దీంతో కనీసం డిపాజిట్ దక్కితే అదే పదివేలని పోటీ చేసే అభ్యర్థులు కోరుకుంటూ ఉంటారు.

126 మందికి డిపాజిట్ గల్లంతు

నంద్యాల పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో 140 మంది అభ్యర్థులు వివిధ పార్టీల తరఫున అలాగే కొంత మంది స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేశారు. కానీ, వీరిలో కేవలం ప్రధాన పార్టీలైన వైఎస్సార్ సీపీ, టీడీపీ అభ్యర్థులకు మాత్రమే డిపాజిట్‌లు వచ్చాయి. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీఎస్పీతో పాటు ఎస్పీ నుంచి పోటీ చేసిన వారికి సైతం డిపాజిట్ దక్కలేదు. ఏడు నియోజకవర్గాల్లో ఇద్దరికి చొప్పున 14 మంది డిపాజిట్ దక్కించుకోగా 126 మంది తమ డిపాజిట్‌ను కోల్పోయారు.

పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో...

లోక్‌సభకు పోటీ చేసిన వారిలో కేవలం ఇద్దరికి మాత్రమే డిపాజిట్ దక్కింది. వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేసిన పోచా బ్రహ్మానందరెడ్డి, టీడీపీ నుంచి పోటీ చేసిన విజయం సాధించిన బైరెడ్డి శబరి మాత్రమే డిపాజిట్ దక్కించుకున్నారు. మొత్తం 31 మంది అభ్యర్థులు బరిలో నిలిస్తే కాంగ్రెస్ అభ్యర్థితో సహా 29 మంది ధరావత్తు కోల్పోయారు.

గత ఎన్నికల్లో జనసేన.. ప్రస్తుతం కాంగ్రెస్

2019 ఎన్నికల్లో జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల నుంచి జనసేన పార్టీ అభ్యర్థులు బరిలో నిలిస్తే ఏ ఒక్కరికి డిపాజిట్ రాలేదు. ఆళ్లగడ్డ నుంచి పోటీ చేసిన సులం రామకృష్ణుడికి 1.41 శాతం, శ్రీశైలం నుంచి పోటీ చేసిన ఎస్.సుజలకు 1.3 శాతం, నందికొట్కూరు నుంచి పోటీ చేసిన అన్నపురెడ్డి బాల వెంకట్‌కు 1.92 శాతం, పాణ్యం నుంచి పోటీ చేసిన చింతా సురేష్ బాబుకు 2.37 శాతం, నంద్యాల నుంచి పోటీ చేసిన సజ్జల శ్రీధర్‌రెడ్డికి 3.04 శాతం, బనగానపల్లె నుంచి బరిలో నిలిచిన అరవింట రాణికి 0.78 శాతం ఓట్లు సాధించారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులకు డిపాజిట్ దక్కలేదు.

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	నోటా	పోటీ చేసిన అభ్యర్థులు	డిపాజిట్ రానివారు
ఆళ్లగడ్డ	2,32,676	1,95,582	1582	18	16
శ్రీశైలం	1,96,116	1,62,760	1077	18	16
నందికొట్కూరు	2,18,047	1,84,892	1274	18	16
నంద్యాల	2,73,938	2,05,190	1518	28	26
బనగానపల్లె	2,41,179	2,03,839	1528	28	26
డోన్	2,27,351	1,88,169	1362	16	14
పాణ్యం	3,31,706	2,50,276	2663	14	12

జిల్లాలో భారీ వర్షం



సంజామల మండలంలోని పాలేరు వాగులో చిక్కుకున్న ఆర్టీసీ బస్సు

- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- బేతంచెర్లలో అత్యధికంగా 94.2 మి. మీ వర్షపాతం నమోదు
- సంజామల మండలంలోని వాగులో చిక్కుకున్న ఆర్టీసీ బస్సు
- డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ముప్పు
- 24 మంది ప్రయాణికులు సురక్షితం

నంద్యాల(సెంట్రల్): నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు పలు మండలాల్లో కుండపోత వర్షం కురిసింది. పలుచోట్ల వాగులు, వంకలు, పొంగిపొర్లి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సంజామల మండలం పాలేరు వాగు, మిడుతూరు మండలం తలముడిపి వద్ద కుందూ నది పొంగిపొర్లి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. సంజామల మండలం పాలేరు వాగు ప్రవాహ ఉధృతిలో ఆర్టీసీ బస్సు చిక్కుకుంది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో 24 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. అత్యధికంగా బేతంచెర్లలో 94.2 మి.మీ వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా పగిద్యాలలో 2.4 మి.మీల వర్షం కురిసింది. కొత్తపల్లె, రుద్రవరం మండలాల్లో వర్షపాతం నమోదు కాలేదు.

మండల పేరు	వర్షపాతం వివరాలు (మి.మీలలో)
సంజామల	93
పాణ్యం	66.8
బండిఆత్మకూరు	64.8
డోన్	49.2
గోస్పాడు	39.2
అవుకు	33.4
బనగానపల్లె	33.3
నందికొట్కూరు	32.4
కొలిమిగుండ్ల	31.8
దొర్నిపాడు	26.6
మిడుతూరు	26.4
శిరివెళ్ల	20
కోవెలకుంట్ల	20
మహానంది	19.2
ఆత్మకూరు	17.8
గడివేముల	16.8
నంద్యాల	12.8
వెలుగోడు	10.2
జూపాడుబంగ్లా	8.8
ప్యాపిలి	7.8
ఆళ్లగడ్డ	6.8
చాగలమర్రి	5
శ్రీశైలం	4.8
ఉయ్యాలవాడ	4
పాములపాడు	2.8
పగిద్యాల	2.4

శ్రీశైల మల్లన్న హుండీ ఆదాయం రూ.4.04కోట్లు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం దేవస్థానంలోని ఉభయ దేవాలయాలలోని హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా దేవస్థానానికి రూ.4,04,21,906 నగదు లభించినట్లు దేవస్థానం ఈఓ డి.పెద్ది రాజు తెలిపారు. గురువారం ఆలయంలోని అలంకార మండపంలో హుండీ లెక్కింపు చేపట్టారు. కాగా ఆలయ హుండీల రాబడిని భక్తులు గత 28 రోజులలో సమర్పించినట్లు ఈఓ తెలిపారు. అలాగే నగదుతో పాటు ఈ హుండీలో 332 గ్రాముల 500 మిల్లీగ్రాముల బంగారు, 5 కేజీల 760 గ్రాముల వెండితో పాటు విదేశీ కరెన్సీ వచ్చిందన్నారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాతో ఈ లెక్కింపును చేపట్టామన్నారు. కార్యక్రమములో డిప్యూటీ కార్యనిర్వహణాధికారిణి రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.



భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తున్న దేవస్థాన అధికారులు, సిబ్బంది



రమణీయం.. జలసోయగం

వర్షాలు కురుస్తుండటంతో వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయి. కొండకోనల్లో జలపాతాలు కనువిందు చేస్తున్నాయి. గురువారం జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. దీంతో బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం సమీపంలోని మద్దిలేటి స్వామి ఆలయం వద్ద మద్దిలేరయ్య వాగు పొంగి ప్రవహించింది. ఎర్రమల కొండల నుంచి నీరు దుముకుతూ సుందర దృశ్యాన్ని ఆవిష్కరించింది. స్వామి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు మద్దిలేరయ్య వాగు వద్ద జలసోయగాలను చూసి తన్మయత్వానికి గురయ్యారు.

– బేతంచర్ల

కాన్వొకేషన్‌కు 3,826 దరఖాస్తులు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం కాన్వొకేషన్‌కు 3,826 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. కాన్వకేషన్‌కు మే 17వ తేదీన వర్సిటీ అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. గురువారం దరఖాస్తు గడువు ముగిసింది. ఈనెల మూడో వారంలో కాన్వొకేషన్ నిర్వహించనున్నారు. కార్యక్రమానికి వర్సిటీ కులపతి రాష్ట్ర గవర్నర్ హాజరు కానున్నారు. గవర్నర్ చేతుల మీదుగా పీజీ విద్యార్థులు 68 మంది, పీహెచ్‌డీ స్కాలర్స్ 32 మంది మొత్తం 100 మంది కాన్వకేషన్ పట్టా తీసుకోనున్నారు.

డోన్ చేరిన దిగంబర జైన సన్యాసుల పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న జైన సన్యాసులు

ప్యాపిలి/డోన్ టౌన్: ప్రజలు అహింసా మార్గంలో నడవాలన్న సందేశాన్ని ఇస్తూ దిగంబర జైన సన్యాసులు చేపట్టిన పాదయాత్ర గురువారం ప్యాపిలి మీదుగా డోన్‌కు చేరుకుంది. బెంగళూరు నుంచి అంతర్మాన గురుదేవ్ ఆచార్య శ్రీ 108 ప్రసన్న సాగర్జీ మహరాజ్ జీ సంసంద్ తరఫున 15 మంది సాధువులు ఒంటిపై నూలుపోగు లేకుండా పాదయాత్ర చేస్తున్నారు. అనంతపురం మీదుగా ప్యాపిలికి అనంతరం డోన్‌కు చేరుకుంది. హైదరాబాదు మీదుగా గోమతేశ్వరం చేరుకుని అక్కడి నుంచి కుల్పారం చేరుకోనున్నట్లు పాదయాత్ర భక్తులు తెలిపారు. పాదయాత్ర చేస్తున్న జైన సన్యాసులను పలువురు దర్శించుకుని ఆశీస్సులు తీసుకున్నారు.

పండ్ల తోటలకు మెట్ట భూములు అనుకూలం

- ఎర్ర నేలలు, నల్ల నేలల్లో సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి
- ఎరువుల యాజమాన్యంపై అవగాహన కలిగి ఉండాలి
- వ్యవసాయ శాఖ కర్నూలు ఏడీఏ సాలురెడ్డి



ఖరీఫ్ సాగుకు భూములను సిద్ధం చేసుకుంటున్న రైతు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో 70 నుంచి 75 శాతం వరకు వ్యవసాయం వర్షాధారంగానే జరుగుతోంది. మెట్టసాగులో 65 శాతం ఎర్ర నేలలు, 35 శాతం నల్లరేగడి నేలలు ఉన్నాయి. తక్కువ వర్షపాతం నమోదవుతుండటం.. అది కూడా సకాలంలో పడకపోవడంతో తక్కువ దిగుబడులు వస్తున్నాయి. కొన్ని యాజమాన్య పద్ధతులు, మెలకువలు పాటించి నష్టాలను అధిగమించి అధిక దిగుబడులు సాధించాలని కర్నూలు ఏడీఏ ఎస్.సాలురెడ్డి సూచించారు.

ఎర్ర నేలల యాజమాన్యం

లోతు తక్కువగా ఉంటుంది. అందువల్ల నీటిని నిలుపుకునే సామర్థ్యం కూడా తక్కువగా ఉండటం వల్ల వర్షం ద్వారా లభించే నీరు ఒరవడి(రన్‌అప్) రూపంలో నష్టపోవడమే గాక సారవంతమైన మట్టి పైపొర కొట్టుకుపోతుంది. దీనిని నివారించడానికి వాలుకు అడ్డంగా సేద్యం చేసుకోవాలి. కాంటూరు గట్లు ఏర్పాటు చేసుకోవాలి. వాలుకు అడ్డంగా దుక్కి దున్నడం వల్ల, విత్తడం, అంతర కృషి చేయడం వల్ల నీటి ఒరవడిని ఎక్కడికక్కడే అరికట్టి ఎక్కువ నీరు భూమిలోకి ఇంకేలా చూసుకోవాలి. 2 శాతం వాలు కల్గిన నేలల్లో ప్రతి 50 మీటర్ల దూరానికి 0.63 ఘనపు మీటర్ల పరిమాణంలో కాంటూరు గట్లు వేయాలి. నేల పైపొర గట్టిపడే భూముల్లో ఎకరాకు 10–15 టన్నుల ఇసుకతో కలియదున్నాలి. ఇటువంటి నేలల్లో వేరుశనగ ఊడలు సులభంగా దిగి కాయలు బాగా ఊరుతాయి. వర్షపు నీరు బాగా భూమిలోకి ఇంకిపోవడం వల్ల నీటి వృథా తగ్గుతుంది.

- వేరుశనగలో అంతర పంటగా వేసే కందితో పాటు నీటి ఒరవడిని అరికట్టే ఉలువ, అలసంద కలిపి విత్తితే మంచి ఫలితం ఉంటుంది.

వర్షపు నీటి యాజమాన్యం

మెట్ట ప్రాంతాల్లో 10 నుంచి 40 రోజుల వరకు పంట కాలంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడవచ్చు. ఒక్కోసారి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడం వల్ల పొలం నుంచి నీరు పొంగి పొర్లుతుంది. ఈ నీటిని నీటిగుంటలో (ఫాంపాండ్) నిల్వ చేసి పైరు 10 రోజులకు మించి వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొన్నప్పుడు స్ప్రింక్లర్ల ద్వారా గంటసేపు తడిపితే 20–30 శాతం దిగుబడి పెరుగుతంది. నీటిగుంటలను (ఫాంపాండ్) 10 మీటర్ల పొడవు, 10 మీటర్లు వెడల్పు, 2.5 మీటర్ల లోతులో తవ్వుకోవాలి. నీటి గుంతల్లో నీరు నిల్వ ఉండటానికి ఆరు భాగాలు మట్టి, ఒక భాగం సిమెంటు తగినంత నీటిని కలిపి గుంతలోపలి భాగంలో పూయాలి. దీనివల్ల గుంతలో నీరు 2 నెలల వరకు నిల్వ ఉంటుంది. వేరుశనగ, పత్తి, కంది, శెనగ, జొన్న తదితర పంటల్లో కీలక దశలో ఈ నీటిని వాడుకోవచ్చు. అనంత వేరుశనగ విత్తే పరికరంతో విత్తిన పొలాల్లో కలుపు నివారణకు ట్రాక్టర్‌తో నడిచే అంతర కృషి పరికరాన్ని వాడవచ్చు. దీనితో వరుసల మధ్య కలుపును సులభంగా నియంత్రించవచ్చు. హెక్టారు వేరుశనగ పంటతో పాటు 10 గొర్రె పిల్లల్ని నాలుగు నెలలు పెంచితే అదనపు ఆదాయం ఉపాధి లభిస్తుంది.

మెట్ట భూములకు అనువైన పండ్ల తోటలు

తక్కువ నీటితో ఫలసాయాన్ని ఇచ్చే రేగు, సీతాఫలం, మామిడి, సపోటలను మెట్ట పంటలుగా పెట్టవచ్చు. సాగునీరు అందించే పరిస్థితుల్లో దానిమ్మ, సపోట, మామిడి పంటలను సాగు చేసి వాటిల్లో మూడేళ్ల వరకు అంతర పంటలు వేసి అధిక ఆదాయం పొందవచ్చు.

ఎరువుల యాజమాన్యం

వేరుశనగకు వేరుశనగ+కంది అంతర పంటకు విత్తే ముందు ఎకరాకు 8 కిలోల నత్రజని, 16 కిలోల బాస్వరం, పొటాష్‌నిచ్చే ఎరువులు వేయాలి.

- జొన్న, సజ్జ, సజ్జ+కంది పంటలకు 16 కిలోల నత్రజని, బాస్వరాన్నిచ్చే ఎరువులు వేసుకోవాలి.
- ఉలువకు 4 కిలోల నత్రజని, 12 కిలోల బాస్వరం వేయాలి. భూసార పరీక్షలను అనుసరించి బాస్వరం, పొటాష్ ఎరువుల మోతాదును నిర్ధారించాలి.
- వేరుశనగకు భూసార పరీక్షననుసరించి ఎరువులు వాడాలి. నేలలో లభ్యమయ్యే బాస్వరం ఎకరానికి 10 కంటే తక్కువగా ఉంటే 16 కిలో, 10 నుంచి 20 ఉంటే 8 కిలోల బాస్వరం వేయాలి.
- లభ్య పొటాష్ 60 కంటే తక్కువగా ఉంటే 16 కిలోలు, 60–120 కిలోల మధ్య ఉంటే పొటాష్ 8 కిలోలు వేయాలి. 120 మించితే పొటాష్ వేయనవసరం లేదు.
- జింక్ లోపం ఉన్న నేలల్లో వేరుశనగ విత్తిన 35 రోజులకు, 45 రోజులకు జింక్ సల్ఫేట్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

నల్ల నేలలు

నల్ల నేలలకు నీటి నిల్వ ఉంచుకునే శక్తి ఎక్కువ. వర్షపు నీరు త్వరగా ఇంకదు. అందువల్ల అధిక శాతం నీరు, మట్టి కొట్టుకుపోతుంది. ఈ నేలల్లో భూసంరక్షణ, దున్నడంలో సాంకేతిక పద్ధతులు అవలంభించాలి. ఎర్ర నేలలకు వేసే కాంటూరు గట్ల మాదిరే నల్ల నేలలకు గ్రేడెడ్ గట్లు వేయాలి. 0.80 ఘనపు మీటర్ల గ్రేడెడ్ గట్లు వేసుకోవాలి. గట్ల పైభాగాన 0.1-0.25 శాతం వాలుతో నీరు పోవడానికి కాలువ తీసి దీనిని పెద్ద కాలువతో కలిపి నేల కోత లేకుండా నీటిని బయటకు పోయేలా చూడాలి. వెడల్పాటి బోదెలు, కాల్వలుగా నేలను తయారు చేసి బోదెల పైన విత్తుకోవాలి. కాల్వలు ఎక్కువైనా నీటిని బయటకు పంపడానికి ఉపయోగపడతాయి. మూడు మీటర్ల వెడల్పుతో 20 సెం.మీ ఎత్తు గల వెడల్పాటి బోదెలు చేసి విత్తుకుంటే మంచి దిగుబడులుంటాయి. ఎకరాకు 8 టన్నుల పశువుల ఎరువు వేస్తే నీరు బాగా ఇంకుతుంది.

ఆరోగ్యశ్రీ కేసులను నిర్లక్ష్యం చేయొద్దు



మాట్లాడుతున్న డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఆరోగ్యశ్రీ కేసులు ట్రస్ట్‌లో తిరస్కరణకు గురిగాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసుకోవాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకరరెడ్డి సూచించారు. గురువారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులోని కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన ఆరోగ్యశ్రీ డేటా ఎంట్రీ ఆపరేటర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్య కేసుల ప్రీఆథ రైజేషన్, డిశ్చార్జ్, క్లెయిమ్ ప్రాసెస్ త్వరగా అప్‌డేటా చేయాలన్నారు. ఆరోగ్యశ్రీ లక్ష్యాలను సాధించిన వారికి బోనస్ ప్రకటిస్తామన్నారు. ఆసుపత్రికి రెవెన్యూ జనరేట్ చేయడమే గాకుండా ఆరోగ్యశ్రీ డబ్బు వల్ల రోగులకు నాణ్యమైన వైద్యం అందించే అవకాశం ఉందన్నారు. అవుట్ పేషెంట్ డేటా ఎంట్రీ డేకేర్ ప్రొసీజర్ అప్‌లోడ్ చేయాలన్నారు. రోగులు, వారి సహాయకులతో కో ఆర్డినేషన్ చేసుకుని మెరుగైన సేవలందించాలన్నారు. ఆరోగ్యశ్రీ అమలులో రాష్ట్రంలోనే మన ఆసుపత్రి ప్రథమ స్థానంలో ఉండాలనే లక్ష్యంతో పని చేయాలన్నారు. ఇకపై తాను అన్ని విభాగాలను సందర్శిస్తానన్నారు. ఏవైనా టెక్నికల్ ప్రాబ్లెమ్స్ ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఆరోగ్యశ్రీపై ప్రతి వారం సమీక్ష చేస్తానన్నారు. సమావేశంలో సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ఏఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ శివబాలానాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.


సెబ్ కానిస్టేబుల్‌కు బెస్ట్ ఫీల్డ్ స్టాఫ్ అవార్డు



సెబ్ కమిషనర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న విజయ్‌కుమార్

కర్నూలు: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇంటెలిజెన్స్ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సి.విజయ్‌కుమార్‌కు బెస్ట్ ఫీల్డ్ స్టాఫ్ అవార్డు దక్కింది. విధి నిర్వహణతో పాటు మద్యం అక్రమ రవాణాదారుల సమాచారం సేకరించడంలో ప్రతిభ కనపరచిన ఈయన 2023 సంవత్సరానికి ఏపీ సెబ్ కమిషనర్ ఎం.రవిప్రకాష్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. 2014 బ్యాచ్‌కు చెందిన ఈయన 993 లీటర్ల అక్రమ మద్యంతో పాటు 36 వాహనాలను సీజ్ చేయడంలో తన ప్రతిభ కనపరిచాడని, అలాగే పొరుగు రాష్ట్రాల నుంచి జిల్లాలోకి అక్రమంగా మద్యం రవాణా చేసి విక్రయాలు చేపడుతున్న ముగ్గురు ప్రధాన సూత్రదారులపై నిఘా వేసి పట్టుకోవడానికి సమాచార సేకరణలో ప్రతిభ కనపరిచాడు. అలాగే పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో 120 లీటర్ల నాటుసారాను ఆటోలో రవాణా చేస్తుండగా నిఘా వేసి పట్టుకున్నారు. పలు కేసుల ఛేదనలో అంకితభావంతో పనిచేశాడని కర్నూలు సెబ్ సూపరింటెండెంట్ రవిప్రకాష్ ప్రతిపాదన మేరకు ఆ శాఖ కమిషనర్ కానిస్టేబుల్‌కు అవార్డును అందజేశారు.

బియ్యం బస్తాల లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

ప్యాపిలి: మండల పరిధిలోని పోతుదొడ్డి వద్ద గురువారం బియ్యం బస్తాల లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడింది. హైదరాబాదు నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న లారీ పోతుదొడ్డి వద్దకు రాగానే అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో లారీలో ఉన్న బాస్మతి బియ్యం ప్యాకెట్లు కిందపడ్డాయి. విషయం తెలుసుకున్న స్థానికులు బియ్యం ప్యాకెట్లు తీసుకెళ్లారు. కాగా ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

నదిలో పడి వ్యక్తి మృతి



షేక్ ఖాదర్ బాషా (ఫైల్)

కర్నూలు: అప్పు ఇచ్చిన వారు ఇంటి వద్దకు రావడంతో తప్పించుకోవడానికి దొడ్డి మార్గంలో పరిగెత్తుకుంటూ వెళ్లి హంద్రీ నదిలో పడి కల్లూరు మండలం బీఆర్ రెడ్డి కాలనీలో నివాసముంటున్న షేక్ ఖాదర్ బాషా (38) మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఇతడు టీ హోటల్‌లో పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కుటుంబం జరగక హోటల్ యజమాని వద్ద రూ.15 వేలు అప్పుగా తీసుకున్నాడు. కొన్నాళ్ల తర్వాత ఆరోగ్యం బాగోలేక పనికి వెళ్లడం మానేశాడు. ఈనెల 4న అప్పు ఇచ్చిన హోటల్ యజమాని ఇంటి వద్దకు రావడంతో ఖాదర్ బాషా తప్పించుకోవడానికి ముజఫర్ నగర్‌లోని ఐఎంఎల్ ఫ్యాక్టరీ వెనక ఉన్న హంద్రీ నదిలోకి పారిపోయాడు. తిరిగి ఇంటికి రాలేదు. కాగా గురువారం ఉదయం హంద్రీ నదిలో గుర్తు తెలియని మృతదేహం పడివున్నట్లు తెలుసుకుని షేక్ ఖాదర్ బాషా భార్య షేక్ సలీమా కుటుంబ సభ్యులతో వెళ్లి చూసి తన భర్తగా గుర్తించింది. అప్పు ఇచ్చిన వారి నుంచి తప్పించుకోవడానికి నదిలోకి పరుగెత్తాడని, ఈత రాకపోవడంతో మునిగిపోయాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. 4వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి ఆస్పత్రిలోని మార్చురీ కేంద్రంలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

విద్యుదాఘాతానికి ఇద్దరు మృతి





మృతిచెందిన ఈశ్వరమ్మ, పాండురంగ

బేతంచెర్ల: జిల్లాలో గురువారం ఒక్క రోజే విద్యుదాఘాతానికి గురై ఇద్దరు మృతిచెందారు. వేర్వేరు చోట్ల జరిగిన ఈ ప్రమాదాల వల్ల వారి కుటుంబాలకు తీరని శోకం మిగిలింది. బేతంచెర్ల పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కాలనీ సమీపంలో నివాసం ఉంటున్న సమరసత సేవా ఫౌండేషన్ బనగానపల్లె సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ గాజుల బాలీశ్వర్‌రెడ్డి భార్య ఈశ్వరమ్మ(48) విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. ఈశ్వరమ్మ బాత్‌రూంలో స్విచ్ ఆన్‌చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బేతంచెర్ల శేషారెడ్డి సీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలికి కొడుకు, కుమార్తె ఉన్నారు.

మైనింగ్ గని విద్యుత్ మోటార్ వద్ద..

బనగానపల్లె రూరల్: మైనింగ్ గని విద్యుత్ మోటార్ వద్ద విద్యుదాఘానాకి గురై గుంమండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన ఎస్ పాండురంగ(32) మృతిచెందాడు. ఎస్‌ఐ తిరుపాల్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన పాండురంగ అదే గ్రామానికి చెందిన ఓ మైనింగ్ యజమాని గనిలో గుమాస్తాగా పని చేస్తున్నాడు. గురువారం గనిలో నిండిన వర్షాపు నీటిని బయటకు పంపేందుకు విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ మోటార్‌ను ఆఫ్ చేసేక్రమంలో పాండురంగ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య శిరీషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు సంతానం ఉన్నారు.

చింతలాయిపల్లెలో దారుణహత్య

- మద్యం తాపి రాళ్లతో తలపై మోదిన దుండగలు





హత్యకు గురైన నాగేంద్ర (ఇన్‌సెట్)నాగేంద్ర(ఫైల్)

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని చింతలాయిపల్లెలో ఓ వ్యక్తి గురువారం దారుణ హత్యకు గురయ్యాడు. సీఐ గోపీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మంజుల నాగేంద్ర(34) నాపరాతి గనిలో కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అదే గ్రామానికి చెందిన మంజుల రామాంజి, పెద్దపుల్లయ్యలతో నాగేంద్ర భార్య నాగలక్ష్మి చనువుగా ఉండేది. విషయం తెలుసుకున్న భర్త వారిద్దరినీ పలుమార్లు మందలించాడు. ఈవిషయాన్ని మనసులో పెట్టుకున్న రామాంజి, పెద్ద పుల్లయ్య.. నాగేంద్రను హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా పార్టీ చేసుకుందామని నాగేంద్రను గ్రామంలోని గంగమ్మ గుడి వద్దకు తీసుకెళ్లారు. అక్కడ రామాంజి, పెద్ద పుల్లయ్యతో పాటు మరో వ్యక్తి మంజుల మనోహర్‌తో కలిసి మద్యం తాగారు. ఆ తర్వాత ముగ్గురూ కలిసి నాగేంద్ర తలపై రాళ్లతో విచక్షణా రహితంగా కొట్టి పరారయ్యారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని కొన ఊపిరితో ఉన్న నాగేంద్రను అనంతపురం జిల్లా తాడిపత్రి ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి సోదరుడు మంజుల నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు సీఐ చెప్పారు. కాగా ముగ్గురు నిందితులు పోలీసులు అదుపులో ఉన్నట్లు సమాచారం.

తొమ్మిదేళ్ల బాలిక హత్య



బాలిక మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

అర్ధవీడు(బేస్తవారిపేట): మండలంలోని అర్ధవీడు జెడ్పీ హైస్కూల్ అటెండర్ పుచ్చకాయల రమణారెడ్డి, లక్ష్మీపద్మావతి దంపతుల తొమ్మిదేళ్ల కుమార్తె హత్యకు గురైంది. రమణారెడ్డికి పిల్లలు లేకపోవడంతో రాచర్ల మండలం అనుమలవీడుకు చెందిన సోదరుడు వెంకటరంగారెడ్డి కుమార్తె సాన్వికరెడ్డి(9)ని ఏడు నెలల వయస్సున్నప్పటి నుంచి రమణారెడ్డి, లక్ష్మీపద్మావతి దంపతులు పెంచుకుంటున్నారు. సాన్వికరెడ్డి అర్ధవీడులోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 3వ తరగతి చదువుతోంది. గురువారం ఉదయం బంధువులు పొలంలో బోరు వేయిస్తుండటంతో రమణారెడ్డి అక్కడకు వెళ్లగా భార్య లక్ష్మీపద్మావతి ఒక బెడ్‌రూమ్‌లో, కూతురు సాన్విక రెడ్డి మరో బెడ్ రూంలో నిద్రపోయారు. రమణారెడ్డి తల్లిదండ్రులు హాల్‌లో టీవీ చూస్తున్నారు. పొలం నుంచి ఇంటికి వచ్చిన రమణారెడ్డి కుమార్తె బెడ్‌రూమ్‌లోకి వెళ్లి చూడగా ముఖంపై దిండు ఉంది. దిండు తొలగించి చూడగా గొంతుపై గాయాలతో అచేతన స్థితిలో ఉంది. వెంటనే గ్రామంలోని ఆర్ఎంపీ వద్దకు ఎత్తుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు ఆయన నిర్ధారించారు. చిన్నారి మృతితో కుటుంబ సభ్యులు భోరున విలపించారు. కాగా హత్య ఎవరు ఏశారు? ఎందుకు చేశారనే వివరాలు తెలియాల్సి ఉంది. కంభం సీఐ రామకోటయ్య, ఎస్‌ఐ ఎం.అనిత ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కారు ఢీకొని యువకుడి దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు



మెహదీహసన్ మృతదేహం

బనగానపల్లె రూరల్: మండలంలోని యనకండ్ల గ్రామ సమీపంలో బుధవారం రాత్రి కారు ఢీకొని ఓ యువకుడు దుర్మరణం చెందాడు. మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్‌ఐ రామిరెడ్డి తెలిపిన వివరాలు.. కొండపేటకు చెందిన మహబూబ్‌బాషా కుమారుడు మెహదీహసన్(23) స్నేహితుడు మస్తాన్‌వలితో కలిసి బుధవారం బేతంచెర్లకు వెళ్లారు. పని ముగించుకుని రాత్రి బైక్‌పై తిరుగు పయనమయ్యారు. యనకండ్ల గ్రామంలోని పెట్రోల్ బంకు వద్దకు రాగానే బనగానపల్లె నుంచి అతివేగంగా బేతంచెర్ల వైపు వెళ్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో మెహదీహసన్ అక్కడికక్కడే మృతి చెందగా మస్తాన్‌వలికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని బనగానపల్లె వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెహదీహసన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి, మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

27న నూతన కార్యవర్గ ఎన్నికలు

నంద్యాల(న్యూటౌన్): కర్నూలు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఈనెల 27న నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరామమూర్తి, బాలమద్దిలేటి తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ నంద్యాలలోని గుడ్‌షెపర్డ్ స్కూల్‌లో నిర్వహించనున్న సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటామన్నారు.

క్లుప్తంగా

ఆస్పత్రి స్టాక్ రూమ్‌లో పాము కలకలం



పామును చూపుతున్న దృశ్యం

ఆదోని అర్బన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మందులను నిల్వ చేసే స్టాక్ రూమ్‌లో గురువారం పాము కలకలం రేపింది. నర్సులు స్టాకు రూమ్‌లోకి వెళ్లగా పాము కనిపించడంతో భయాందోళనతో పరుగులు తీశారు. ఆస్పత్రి సిబ్బంది వెంటనే పాములు పట్టే వ్యక్తికి సమాచారం అందించారు. అతడు అక్కడకు చేరుకుని పామును వెతికి పట్టుకుని శివారు ప్రాంతాల్లో వదిలేయడంతో ఆస్పత్రి సిబ్బంది, డాక్టర్లు ఊపిరి పీల్చుకున్నారు.

‘పద్మ’ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు (టౌన్): ఆగస్టు నెలలో నిర్వహించనున్న స్వాతంత్య్ర దిన వేడుకల్లో భారత ప్రభుత్వం క్రీడల్లో ప్రతిభ కనబరచిన వారికి పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ పురస్కారాలు అందించనుందని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పతకాలు సాధించిన వారు www.padmaawards.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను పొందవచ్చని పేర్కొన్నారు. క్రీడాకారులు వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకొని వాటి వివరాలను విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ మెయిల్ అడ్రస్ sportsinap@gmail.comకు ఆగస్టు 1వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు పంపించాల్సి ఉంటుందని తెలిపారు.

అభినందనలు తెలిపేందుకు ‘ఈ పోస్టు’

కర్నూలు (న్యూటౌన్): సార్వత్రిక ఎన్నికల్లో విజేతలుగా నిలిచిన నాయకులకు ఈ పోస్టు ద్వారా అభినందనలు తెలియజేసేందుకు తపాలా శాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని కర్నూలు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ జి జనార్దన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలకు హృదయ పూర్వక అభినందనలు తెలియజేయవచ్చన్నారు. ఇందుకు దగ్గరలోని ఉన్న ఏదైనా పోస్టాఫీసుకు వెళ్లి రూ.12 రుసుం మాత్రమే చెల్లిస్తే చాలని పేర్కొన్నారు. ఈ విధంగా పంపిన సందేశాలు నేరుగా అభిమాన నాయకుని చేతికే చేరుతాయని తెలిపారు. మరింత సమాచారం కోసం దగ్గరలోని పోస్టాఫీసులో సంప్రదించాలని కోరారు.

ఆలూరు నియోజకవర్గం నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు



విరూపాక్షి జయరాం రామాంజనేయులు

ఆలూరు: సార్వత్రిక ఎన్నికల్లో ఆలూరు నియోజకవర్గం నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. ఆలూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా చిప్పగిరి గ్రామానికి చెందిన బుసినె విరూపాక్షి గెలిచారు. అలాగే ఆలూరు గ్రామానికి చెందిన రిటైర్డు ఐఏఎస్ అధికారి బూర్ల రామాంజనేయులు గుంటూరు జిల్లా పత్తిపాడు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందారు. అదేవిధంగా చిప్పగిరి మండలం గుమ్మనూరు గ్రామానికి చెందిన గుమ్మనూరు జయరాం అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గం నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. బుసినె విరూపాక్షి, బూర్ల రామాంజనేయులు తొలిసారిగా ఎమ్మెల్యేలుగా గెలుపొంది శాసన సభలోకి అడుగు పెట్టనుండగా.. గుమ్మనూరు జయరాం మూడోసారి శాసనసభలోకి వెళ్లనున్నారు.

క్లుప్తంగా

మహిళ మృతి.. కేసు నమోదు

ఉయ్యాలవాడ : మండలంలోని మాయలూరు గ్రామానికి చెందిన లక్ష్మీపుల్లమ్మ (54) అనే మహిళ మృతి చెందడంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయులురెడ్డి తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన జయరాజు, జగ్గన్న బుధవారం సాయంత్రం ఘర్షణ పడుతుండగా వారిని విడిపించేందుకు లక్ష్మీపుల్లమ్మ వెళ్లింది. ఆ సమయంలో ఆమెకు బీపీ అధికమై కింద పడి స్పృహ కోల్పోయింది. చికిత్స నిమిత్తం కుమారుడు జనార్ధన్ ఉయ్యాలవాడలో ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం నంద్యాలకు తరలించారు. అక్కడి నుంచి కర్నూలుకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. జనార్ధన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

గోడౌన్‌కు చేరిన ఎన్నికల సామగ్రి



ఎన్నికల సామగ్రిని గోడౌన్‌కు చేర్చుతున్న సిబ్బంది

ఆళ్లగడ్డ: సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించిన ఎన్నికల సమగ్రిని గురువారం పట్టణంలోని గోడౌన్‌కు తరలించారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన ఓట్ల లెక్కింపు సందర్భంగా ఆళ్లగడ్డ నియోజకవర్గ ఎన్నికల కార్యాలయం నుంచి నంద్యాల లెక్కింపు కేంద్రాలకు తరలించిన పోస్టల్ బ్యాలెట్ ఖాళీ పెట్టెలు, ఇతర సరంజామా అంతా భద్రంగా నంద్యాల నుంచి ప్రత్యేక వాహనంలో అధికారుల పర్యవేక్షణలో ఆళ్లగడ్డకు తరలించారు. వీటిని ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో నిబంధనల ప్రకారం ఎన్నికల గోడౌన్‌లో భద్రపరిచారు.

హోటళ్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



హోటల్ డిలైట్‌లో శాంపిల్స్ సేకరిస్తున్న ఏఎఫ్‌సీ కుర్మానాయకులు

నంద్యాల(సిటీ): నంద్యాల జిల్లా పరిధిలోని హోటళ్లు, రెస్టారెంట్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఉమ్మడి జిల్లాల అసిస్టెంట్ ఫుడ్ సేఫ్టీ కమిషనర్ కుర్మా నాయకులు తెలిపారు. గురువారం పట్టణంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లను ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారులు వెంకటరాముడు, ఖాసింవలితో కలిసి ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలో ప్రతి హోటల్, రెస్టారెంట్ ఇతర ఆహార పదార్థాలను విక్రయించే దుకాణాల యజమానులు తప్పనిసరిగా ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను పాటించాలని సూచించారు. బస్టాండ్ వద్ద ఉన్న హోటల్ డిలైట్ లో సేకరించిన శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించామన్నారు.

రైతుల అభివృద్ధికి కృషి చేయాలి



డీఏఓను కలిసిన ఏఈఓల సంఘం నాయకులు

నంద్యాల(అర్బన్): వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామాల్లోని రైతుల అభివృద్ధే లక్ష్యంగా విధులు నిర్వర్తించాలని డీఏఓ మురళీకృష్ణ తెలిపారు. ఇటీవల నంద్యాల జిల్లా డీఏఓగా బాధ్యతలు చేపట్టిన మురళీకృష్ణను ఏఈఓల సంఘం నాయకులు, అధికారులు కలిసి అభినందనలు తెలిపారు. డీఏఓ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాబోతుందని, జిల్లాలో ఏఏ పంటలు సాగు చేయాలో రైతులకు వివరించి వారికి అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా చూడాలని సూచించారు. పంటల సాగులో రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ మంచి దిగుబడులు వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు మణిమోహన్‌రెడ్డి, రవి, మనోహర్ పాల్గొన్నారు.

బరక సంజీవరాయుడికి ప్రత్యేక పూజలు



అలంకరణలో స్వామివారు

మిడుతూరు: రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన శ్రీ బరక సంజీవరాయ స్వామి వారికి అమావాస్యను పురస్కరించుకొని గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ, పల్లకీ సేవా తదితర విశేష పూజలను పురోహితులు నరహరి శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతోపాటు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఊపందుకున్న ఖరీఫ్ సాగు



అప్పనపల్లె వద్ద ఎద్దులతో సేద్యం చేస్తున్న రైతు



ఎల్లావత్తుల వద్ద ముందస్తుగా సాగు చేసిన పత్తి పంట

రుద్రవరం: మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో ఖరీఫ్‌నకు సంబంధించిన సేద్యపు పనులు ఊపందుకున్నాయి. ఇప్పటికే పలు గ్రామాల్లో రైతులు ముందస్తుగా పంటలు కూడా సాగు చేశారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు ముందే తొలి వర్షానికే రైతులు తమ పొలాల్లో వ్యవసాయ పనులు చేపట్టారు. రెండోసారి వర్షం కురవడంతో మినుము, మొక్కజొన్న, మిర్చి వంటి పంటలు సాగు చేశారు. అలాగే ఎల్లావత్తుల పరిధిలో అగ్రిమెంట్ పత్తి కూడా సాగు చేశారు. పలు దఫాలుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో సాగు చేసిన పంటలు కళకలాడుతూ ఏపుగా పెరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం విస్తారంగా వర్షం కురవడంతో మిగిలిన రైతులు వ్యవసాయ పనుల్లోకి దిగారు. ఇందులో భాగంగా రుద్రవరం, అప్పనపల్లె, పందిర్లపల్లె, డి.కొట్టాల, శ్రీరంగాపురం, మందలూరు,,చందూలలరు,చిలుకలూరు, చిన్నకంబలూరు,పెద్దకంబలూరు తదితర గ్రామాల్లోని రైతులు ట్రాక్టర్లు,ఎద్దులతో సేద్యపు పనులు పూర్తి చేసి విత్తు విత్తేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు.

కొనసాగుతున్న బీసీజీ స్పెషల్ డ్రైవ్



గొడిగనూరులో వ్యాక్సిన్ వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

చాగలమర్రి: ప్రభుత్వం టీబీ వ్యాధి నివారణకు చేపట్టిన అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ మండలంలోని ముత్యాలపాడు, చాగలమర్రి పీహెచ్‌సీ పరిధిలోని ఆయా గ్రామాల్లో కొనసాగుతుంది. కార్యక్రమాన్ని ప్రభుత్వ వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతి గురువారం ఆయా గ్రామాల్లో నిర్వహిస్తుంది. స్పెషల్ డ్రైవ్ ద్వారా బీసీజీ టీకాలను 60 సంవత్సరాల పైబడిన వృద్ధులు, షుగర్ వ్యాధిగ్రస్తులకు, టీబీ వ్యాధి బారిన పడి చికిత్స పొందుతున్న వారికి, అలాగే వారి కుటుంబ సభ్యులకు, ధూమపానం, మత్తు పదార్థాలు, గుట్కా సేవిస్తున్న వారికి, 18 కేజీల కంటే తక్కువ బరువు ఉన్న వ్యక్తులకు వేస్తున్నారు. అవకాశాన్ని వినియోగించుకొని వ్యాధి నుంచి కాపాడుకోవాలని వైద్యులు ఇమ్రామన్, శివకుమార్ తెలిపారు. ఆరోగ్య విస్తరణ అధికారులు జి.వెంకటేశ్వర్లు, సుబ్బారాయుడు, సీహెచ్‌ఓ వెంకటమ్మ, ఏఎన్‌ఎం చెంచులక్ష్మి పాల్గొన్నారు. అలాగే చాగలమర్రిలోని 11వ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని డాక్టర్ ఇమ్రాన్ పరిశీలించారు. గత నెల 16వ తేదీ నుండి ఇప్పటి వరకు మండలంలో 870 మందికి బీసీజీ టీకాలు వేసినట్లు తెలిపారు.

నూతన భవనం ఏర్పాటు చేయరూ!



శిథిలావస్థకు చేరిన వ్యవసాయశాఖ మండల కార్యాలయ భవనం

నంద్యాల మండల వ్యవసాయ శాఖకు నూతన భవనం ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ అధికారులు కోరుతున్నారు. నంద్యాల కొత్త జిల్లాగా ఏర్పాటైన నాటి నుంచి స్థానిక ఎఫ్‌టీసీ నాల్గవ తరగతి ఉద్యోగుల క్వార్టర్స్‌లో వ్యవసాయాధికారులు విధులు నిర్వహిస్తున్నారు. ఐదు దశాబ్దాల క్రితం నిర్మించిన క్వార్టర్స్ శిథిలావస్థకు చేరడంతో వర్షా కాలం కార్యాలయంలోని రికార్డులు తడిసి ముద్దవుతున్నాయి. విధులు నిర్వహించేందుకు అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. శిథిలమైన భవనంలో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. నూతన భవనం ఏర్పాటుపై వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి ఇప్పటికే నివేదికలు పంపామని, త్వరగా నూతన భవనం ఏర్పాటయ్యేలా చూడాలని అధికారులు కోరుతున్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించండి



ముత్తలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రుద్రవరం: వేసవి సెలవులు ముగియడంతో ఈనెల 1వతేదీ నుంచే అంగన్‌వాడీ కేంద్రాలు తెరుచుకున్నాయి. ఐదేళ్లు పైబడిన చిన్నారులు ఉంటే వారంతా ప్రాథమిక పాఠశాలలకు వెళ్లనున్నారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో సంఖ్య పెంచేందుకు అంగన్‌వాడీ బాట అనే కార్యక్రమం చేపట్టారు. మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని గ్రామాల్లో ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని ముత్తలూరు 2వ సెంటర్ సిబ్బంది రాజేశ్వరి, చిన్నారులు,వారి తల్లిదండ్రులతో గురువారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. చిన్నారులను కేంద్రాల్లో చేర్పిస్తే మంచి పౌష్టికాహారంతో పాటు ఆటపాటలతో కూడిన అభ్యసన ఉంటుందని చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో దత్తాత్రేయస్వామి

శ్రీశైలం టెంపుల్: లోకకల్యాణంకోసం దేవస్థానం గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవక్షం కింద వెలసిన దత్తాత్రేయస్వామివారికి విశేష పూజలను నిర్వహించింది. పూజాకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజను జరిపించారు. తరువాత స్వామివారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు.

అభివృద్ధికి తోడ్పడండి



ఉయ్యాలవాడ పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న సీఐ హనుమంత్‌నాయక్

ఉయ్యాలవాడ : సార్వత్రిక ఎన్నికల పర్వం ముగిసింది. గ్రామాల్లో అభివృద్ధి చేసుకునేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సమన్వయంతో ముందుకు సాగాలని ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంత్‌నాయక్ ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని ఎన్నికల నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో కక్షలకు, కార్పణ్యాలకు జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవనం కొనసాగించాలని సూచించారు. తమ పిల్లలను మంచి చదువులు చదివించుకుని వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేసేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు. సమస్యలు ఎదురైతే ఘర్షణలకు దిగకుండా పోలీసులను ఆశ్రయించి సమస్యలను పరిష్కరించుకోవాలని చెప్పారు. అనంతరం మండలంలోని పరిస్థితులపై ఎస్‌ఐ రామాంజనేయులురెడ్డి, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

వైభవంగా మహానందీశ్వరుడి కల్యాణం



కల్యాణం అనంతరం ఉత్సవమూర్తులు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీకామేశ్వరిదేవి, మహానందీశ్వర దంపతులకు గురువారం కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు స్థానిక అలంకార మండపంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, మాంగళ్యధారణ, అక్షింతల సమర్పణ చేశారు. పలు ప్రాంతాల భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.

విద్యా కానుక కిట్లను సకాలంలో చేరవేయండి

- సమగ్ర శిక్షా అభియాన్ ఏపీసీ జ్యోతి విజయకుమారి



పుస్తకాలను పరిశీలిస్తున్న ఏపీసీ విజయకుమారి

ఓర్వకల్లు: ప్రభుత్వం సరఫరా చేసిన విద్యా కానుక కిట్లను పాఠశాలలు తెరిచే సమయానికి సకాలంలో చేరవేయాలని సమగ్ర శిక్షా అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జ్యోతి విజయకుమారి అన్నారు. గురువారం స్థానిక ఎంఆర్‌సీలో భద్రపరచిన విద్యా కానుక కిట్లను విజయకుమారితో పాటు, సీఎంఓ అల్లబకాష్ కలిసి తనిఖీ చేశారు. మొదటి విడతలో మండలానికి వచ్చిన పాఠ్యపుస్తకాలు, నోటు బుక్స్, బ్యాగులు, బెల్టుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతానికి 37,869 పాఠ్యపుస్తకాలు, 45,520 నోటు బుక్స్, 6782 స్కూలు బ్యాగులు, 4830 బెల్టులు వచ్చాయని ఎంఈఓ-2 ఓంకార్‌యాదవ్ ఆమెకు వివరించారు. ఈ విద్యా సంవత్సరం ఆరంభం నాటికి విద్యా కానుక కిట్లను విద్యార్థులకు సక్రమంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. ముందుగా సీనియర్ విద్యార్థులకు పంపిణీ చేయాలని, ఆ తర్వాత కొత్త విద్యార్థులకు అందజేయాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా వ్యవహరించండి



మాట్లాడుతున్న గోవిందనాయక్

నంద్యాల(సెంట్రల్): వర్షాకాలం మొదలవుతుండడంతో జిల్లా వ్యాప్తంగా పశుసంవర్ధక శాఖ సిబ్బంది అప్రమత్తతో ఉండాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గోవింద నాయక్ సూచించారు. గురువారం స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాలలో సహాయ సంచాలకులు, మండల పశు వైద్యులు, పారా సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సచివాలయాల్లో కొత్తగా నియమితులైన పశుసంవర్ధక సహాయకులు సంబంధిత పశువైద్యులు, సీనియర్ల సలహాలతో రైతులకు తోడ్పాటు అందించాలని పిలుపునిచ్చారు. ఇన్సూరెన్స్ పోస్టుమార్టం, సెక్స్ సోర్టెడ్ సెమెన్, సర్వీసు రిజిస్టర్‌ల విషయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వపరంగా పాడి రైతులకు అందే సాయంపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వ్యాక్సినేషన్ విషయంలో ఏమాత్రం అలక్ష్యం వద్దని, నిర్దేశించిన లక్ష్యాన్ని సకాలంలో చేరుకోవాలని ఆదేశించారు. ఉపసంచాలకులు రమణమూర్తి మాట్లాడుతూ నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ కార్యక్రమంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని, కొత్తగా నియమితులైన ఏహెచ్‌ఏలు తమకు కేటాయించిన స్థానాల్లో నిత్యం రైతులకు అందుబాటులో ఉండి మంచి పేరు తెచ్చుకోవాలని ఆదేశించారు.

10న చలో సిద్దేశ్వరం

నంద్యాల(సెంట్రల్): సిద్దేశ్వరం అలుగు 8వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 10వ తేదీన చలో సిద్దేశ్వరం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక సమితి కార్యాలయంలో 8వ వార్షికోత్సవ కరపత్రాలను కార్యవర్గ సభ్యులతో కలిసి విడుదల చేశారు. రాయలసీమ కరవు సమస్యకు పరిష్కారంతో పాటు, శ్రీశైలం ప్రాజెక్టు జీవిత కాలం పెరగడానికి కీలకమైన సిద్దేశ్వరం అలుగు శంకుస్థాపన వేలాదిమంది మధ్య మే 16, 2016న ప్రజాసంఘాలు నిర్వహించాయని గుర్తు చేశారు. ఎన్నికల ముందు రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలో రాయలసీమ అంశాలను ఏకరువు పెట్టడం, అనంతరం మోసం చేయడం పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీమ సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్లో 41 శాతం నిధులు కేటాయించాలని, తెలుగుగంగ, గాలేరు-నగరి, హంద్రీనీవా, వెలిగొండ ప్రాజెక్టులు సత్వరం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గుండ్రేవుల, రిజర్వాయర్, వేదవతి ఎత్తిపోతల పథకం, తుంగభద్ర సమాంతర కాలువ, ఆర్‌డీఎస్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. కృష్ణా నదిపై నిర్మిస్తున్న ఐకానిక్ వంతెనకు బదులుగా రోడ్డు కం అలుగు నిర్మించేటట్లుగా కేంద్రాన్ని నూతన ప్రభుత్వం ఒప్పించాలని కోరారు. కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని రాయలసీమ ఉజ్వల భవిష్యత్‌కు పాలకులపై ఒత్తిడి పెంచేలా సహకరించాలని పిలుపునిచ్చారు. సమితి ఉపాధ్యక్షులు వైఎస్ రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి, రాఘవేంద్ర గౌడ్, మహేశ్వర్ రెడ్డి, పట్నం రాముడు, కొమ్మ శ్రీహరి, నిట్టూరు సుధాకర్ రావు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న సాగునీటి సాధన సమితి నాయకులు

ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియ

- ముగిసిన ఎన్నికల కోడ్
- 10వ తేదీ వరకు ర్యాలీలు, బహిరంగ సభలకు అనుమతులు తప్పనిసరి



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లికార్జునరెడ్డి

ఆళ్లగడ్డ: అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు అందరి సహకారంతో నియోజవర్గంలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతవరణంలో ముగిసిందని ఆళ్లగడ్డ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లికార్జునరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన సందర్భంగా గురువారం నియోజవర్గంలోని సహాయ ఎన్నికల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ మొదలైనప్పటి నుంచి ఓట్ల లెక్కింపు పూర్తయ్యేవరకు రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు, పోలీసులు, భద్రతా సిబ్బంది, హమాలీల వరకు ఎంతో నిబద్ధతతో వ్యవహరించారని అభినందించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా విలువైన సూచనలు, సలహాలు ఇచ్చిన ఎన్నికల అబ్జర్వర్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గురువారం సాయంత్రంతో నియోజవర్గంలో అమలవుతున్న ఎన్నికల కోడ్ ముగిసిందని, అయితే ఎటువంటి అవాంచనీయ సఘటనలు చోటుచేసుకోకుండా ఎవరైనా ర్యాలీలు, సభలు నిర్వహించుకోవాలంటే ఈ నెల 10వ తేదీ వరకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

తుది దశకు ఆలయ రక్షణగోడ నిర్మాణం



ఏర్పాటు చేసని రక్షణ గోడ



ప్లాట్‌ఫారంను మట్టితో నింపిన దృశ్యం

శిరివెళ్ల: నల్లమల ఆటవీ ప్రాంతంలోని శ్రీ సర్వ నరసిహస్వామి ఆలయ రక్షణ గోడ నిర్మాణం తుది దశకు చేరుకుంది. 2017లో కురిసిన భారీ వర్షాలకు ఆలయం ముందున్న ధ్వజంతో పాటు ప్లాట్ ఫారం కుంగి పడిపోయింది. దీంతో ఆలయంలో నిత్య పూజలు మినహా ఎలాంటి ఉత్సవాలు జరగడం లేదు. స్వామి వారి జయంతి, కల్యాణాలు నిలిచిపోయాయి. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నాటి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ఎమ్మెల్సీ గంగుల ప్రభాకరరెడ్డి చొరవతో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి నిర్మాణానికి 2022లో రూ.1.60 కోట్ల నిధులు విడుదల చేశారు. దీంతో పనులు మొదలయ్యాయి. వక్కిలేరు వాగు అడుగు భాగం నుంచి 56 అడుగులు ఎత్తు గోడ, వంద అడుగుల మేర వెడల్పుతో రక్షణ గోడ నిర్మాణం చేపట్టారు. నిర్మాణంలో భాగంగా ప్లాట్ ఫారంను 450 టిప్పుల మట్టితో నింపారు. త్వరలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు చేపట్టే అవకాశముంది.

గోవధను నిషేధించాలి



జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): జిల్లాలో జరుగుతున్న జంతువుల అక్రమ రవాణా, గోవధను నిర్మూలించాలని హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు రమేష్ కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ జంతు సంరక్షణ, రవాణా నిబంధనలు, జంతు రవాణా చట్టాలను అమలు పరిచి నోడల్ అధికారిని నియమించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో గోవులను, ఎద్దులను అక్రమంగా చంపుతున్న ప్రదేశాలను గుర్తించి వాటిని తొలగించాల్సిందిగా కోరామన్నారు. విచ్చలవిడిగా, బహిరంగంగా జరుగుతున్న మాంసం విక్రయాలన్నింటినీ గుర్తించి తొలగించాలన్నారు. అక్రమంగా ఈ పనులకు పాల్పడుతున్న వారిని గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, నవీన్‌గౌడ్, ప్రతాప్, రాజు పాల్గొన్నారు.



పంట కాదండోయ్..

ఇక్కడ పచ్చగా కనులకు ఇంపుగా చూసేందుకు పంటలా కనిపిస్తున్నా.. ఇది పంట కాదండోయ్ కురుస్తున్న వర్షాలకు కుందూ నదిలో ఎగువ నుంచి కొట్టుకొచ్చి క్రిష్ణిపాడు వద్ద భారీగా నిలిచిపోయిన గుర్రపు డెక్క. గుర్రపు డెక్క నిలిచిపోవడంతో నీటి ప్రవహానికి అడ్డంకిగా మారింది. తొలగించాలని స్థానికులు ప్రయత్నిస్తున్న నదిలో నీటి ప్రవాహం ఉండటం, ఎగువ నుంచి ఇంకా భారీగా వస్తుండటంతో ఏమీ చేయలేకపోతున్నారు. దీనికారణంగా ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు ఒక్కసారిగి నెమ్మదిస్తుందని, బ్రిడ్జిపై ప్రభావం చూపుతుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. - దొర్నిపాడు

ఆర్టీసీ బస్ ఢీకొని ఇద్దరికి గాయాలు





గాయపడిన అశోక్‌కుమార్, విజయ్‌కుమార్

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల - నంద్యాల ఆర్అండ్‌బీ రహదారిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు.. స్థానిక స్వామినగర్ కాలనీకి చెందిన అశోక్‌కుమార్, విజయ్‌కుమార్ ఇందిరమ్మ కాలనీ నుంచి బైక్‌పై వస్తుండగా నంద్యాలవైపు నుంచి వస్తున్న కోవెలకుంట్ల ఆర్టీసీ డిపో బస్ ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో విజయ్‌కుమార్‌కు కాలు విరగగా, అశోక్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాద ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 89 శాతం హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలోని నిర్వహిస్తున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన పరీక్షలకు 89 శాతం హాజరు నమోదైందని వర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఉదయం సెషన్‌లో జరిగిన డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షలకు 1,542 మందికి గానూ 1,373 మంది, మధ్యాహ్నం సెషన్‌లో జరిగిన 6వ సెమిస్టర్ పరీక్షలకు 417 మందికి గానూ 381 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2, కర్నూలు డిగ్రీ కళాశాల, సాయికృష్ణ డిగ్రీ కళాశాల, తుగ్గలి ఏఎస్ డిగ్రీ కళాశాల, బేతంచర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రాల్లో ఒక్కొక్కరు చొప్పున మొత్తం ఆరుగురు విద్యార్థులు చూచిరాతలకు పాల్పడగా డిబార్ చేసినట్లు తెలిపారు.